క్లుప్తంగా

'ఉపాధి' పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు రోల్‌మామడ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేపట్టాలని సూచించారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు రాఘవ, రాధిక, టీఏలు వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్లు లత, తదితరులు ఉన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేయాలి



పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

తాంసి: ఓటర్ స్లిప్పుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని తాంసి తహసీల్దార్ లక్ష్మి సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీని తహసీల్దార్ పరిశీలించారు. పొన్నారి, హస్నాపూర్ గ్రామాల్లో పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి అందించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, బీఎల్‌వోలు భాగీర్థ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా రమేశ్ పటేల్

బోథ్: బోథ్ మున్నూరుకాపు యువత మండల అధ్యక్షుడిగా మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన తలంపుల రమేశ్ పటేల్ నియమితులయ్యారు. ఈమేరకు మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, హాస్టల్ సదుపాయాల కల్పన, రైతుల సంక్షేమం కోసం పాటు పడతానని అన్నారు.

'సదస్సుపై దాడి అప్రజాస్వామికం'

ఎదులాపురం: వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రచయితల సదస్సుపై ఏబీవీపీ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికమని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ప్రజల హక్కులకు భంగం కలిగిస్తుంటే పౌర సమాజం చూస్తూ ఊరుకోదని, ఇలాంటి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. సోమవారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బేలకు వచ్చిన రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. కాకతీయ యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి, రాపెల్లి కృష్ణ, ఉర్వతే సచిన్, పవన్‌రెడ్డి, కార్తీక్, అజయ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

కైలాస్‌నగర్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 5 నుంచి 16 ఏళ్లలోపు బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ బిన్నీ కౌర్ అహ్లువాలియా జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో విత్ ట్యూబ్, విత్ ఔట్ ట్యూబ్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు.

'శిథిల' కార్యాలయాలు



శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- ఇబ్బందిగా మారిన కార్యకలాపాలు
- ఊసేలేని కొత్త భవనాల నిర్మాణం

బోథ్: జిల్లాలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని మండలాల్లో శిథిలావస్థకు చేరిన కార్యాలయాలల్లోనే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. మరికొన్ని చోట్ల భవనాలను అద్దెకు తీసుకుని కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో కార్యాలయాల పరిస్థితి..

- బజార్‌హత్నూర్ మండలంలోని అద్దె భవనంలో ఎస్సీ హాస్టల్ ఉండగా, తహసీల్ కార్యాలయం, గ్రంథాలయం శిథిలావస్థలో ఉంది.

పలు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

- తలమడుగు మండలంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలకు చేరుకుంది. పలు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.
- తాంసి మండలంలో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. వర్షకాలంలో నీరు కార్యాలయంలోకి వస్తుంది. పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. పోలీస్‌స్టేషన్‌ది అదే పరిస్థితి.
- భీంపూర్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. పోలీస్‌స్టేషన్ పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతోంది.

బిక్కుబిక్కుమంటూ విధులు

బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం 80 ఏళ్ల క్రితం నిజాం ప్రభుత్వం నిర్మించింది. అప్పటి నుంచి ఈ భవనంలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి.

మంజూరు కాని నిధులు..



బోథ్ మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం. బోథ్ నియోజకవర్గంలోని బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ మండలాలకు కలిపి ఈ కార్యాలయం బోథ్‌లో ఉంది. ప్రస్తుతం ఈ కార్యాలయం శిథిలావస్థలకు చేరుకుంది. గోడలు పగుళ్లు తేలాయి. ఫ్లోరింగ్ కుంగిపోయింది. అధికారులు కార్యాలయాన్ని మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. అయినా కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు

కూలిన సబ్ ట్రెజరీ కార్యాలయం



బోథ్ మండల కేంద్రంలోని సబ్ ట్రెజరీ పైకప్పు కూలిపోయింది. అప్పటి నుంచి స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలోని ఓ గదిలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కొత్త కార్యాలయ భవన నిర్మాణంపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



బోథ్ మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ కార్యాలయానికి కొత్త భవనం నిర్మించినా.. ఆ భవనంలోకి ఇప్పటి వరకు కార్యాలయాన్ని మార్చలేదు. ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

వేసవి దుక్కులతో మేలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్న రైతు

- పంటలకు తప్పనున్న చీడపీడల బెడద
- అధిక దిగుబడి పొందే అవకాశం

తాంసి: పంటల సాగు పూర్తయ్యాక వేసవిలో భూములు ఖాళీగా ఉంటాయి. ఈ సమయంలో రైతులు భూసారం పెరిగేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి కలిగిన భూముల తప్పా వర్షాధారంగా పండించే సాగు భూములు వేసవిలో ఖాళీగా ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసే నాటికి సాగుభూమి లోతుగా దున్ని దుక్కులు చేసుకోవడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ముందస్తుగా దుక్కులు చేయడంతో భూమిపై పొరలు లోపలికి, లోపలి పొరలు భూమిపరితలంలోకి చేరుతాయి. వీటితో పంట దిగుబడి అధికంగా పెరుగుతుంది వానాకాలం తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు దుక్కులు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే పలు గ్రామాల రైతులు తమ భూములలో ముందస్తుగా పత్తి పంటను తొలగించి దుక్కులను దున్నిస్తున్నారు.

అధిక దిగుబడికి మార్గం..

- వేసవిలో దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న చేన్లలో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దున్నాలి.
- సుమారుగా తొమ్మిది అంగుళాలకు తగ్గకుండా దుక్కులను దున్నుకోవాలి. లోతు దిక్కులు దున్నినప్పుడు నేలపై పొరలో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించి పురుగులు ఎండ వేడికి చనిపోయే అవకాశం ఉంటుంది. నేల పొరల్లో ఉన్న క్రిమికీటకాలు సైతం నశిస్తాయి.
- ఏపుగా పెరిగే కలుపు మొక్కలను సైతం నివారించుకోవచ్చు. పంటచేనులో తుంగ, గరిక, వయ్యారి భామ, గునుగు పూలు గడ్డిజాతి కలుపు మొక్కలతో రైతులకు నష్టం కలుగుతుంది. వేసవి దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కలు, మొక్కల వేర్లు, కాయలు, దుంపలను ఏరి వేస్తే మంచి ఫలితం ఉంటుంది.

సేంద్రియ ఎరువులతో భూసారం..

పంటచేన్లలో రైతులు భూసారం పెరగడం కోసం ఎద్దులు, ఆవులు, బర్రెలు, మేకల పేడను ప్రతిఏటా వేస్తారు. వీటితోపాటు పంటచేన్లలో పశువుల మందలను సైతం ఉంచుతున్నారు. పశువుల మలమూత్రాలతో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం పశువుల సంఖ్య తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గింది. వేసవిలో పంట చేనులో సేంద్రియ ఎరువులు వేయడంతో పాటు ఎరువులను కలియ దున్నడంతో భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

అవగాహన కల్పించాలి

వేసవి దుక్కుల వలన కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులతో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. క్షేత్రస్థాయిలో గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు తెలియజేయాలి. సరైన అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

– సురేశ్, రైతు, గుంజాల

మంచి ఫలితాలు

వేసవిలో ముందస్తు దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. రైతులు లో తుగా దుక్కులు దున్నాలి. భూమి పొరలు కింద పైన మారడంతో భూమిలో ఆవాసం ఏర్పరుచుకున్న పురుగులు, శిలీంద్రాలు నశి స్తాయి. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే గ్రామాల్లో ఏఈవోలను సంప్రదించాలి.

– రవీందర్, ఏవో, తాంసి

'బీఆర్‌ఎస్‌ది ప్రజాపాలన'



మాట్లాడుతున్న ఆత్రం సక్కు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ పాలించిన పదేళ్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి, పంజేషా కాలనీల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, గంగన్న, పవన్ నాయక్, పండ్ల శ్రీను, యూనుస్ అక్బాని, రాము, స్వరూప, మమత, కస్తాల ప్రేమల, పర్వీన్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: బీఆర్‌ఎస్‌లోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండలంలోని బాదిగూడలో ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనేతరులకు, గిరిజనులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి ఫలాలు అందించిందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతుబంధు, రైతు బీమా , కల్యాణ లక్ష్మి పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు పాండరంగ్, తదితరుల పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'

ఆదిలాబాద్‌రూరల్: ఉచిత విద్యుత్, ఉచిత వంట గ్యాస్, మహిళలకు రూ. 2,500 అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆరోపించారు. సోమవారం మండలంలోని మాలే బోరిగాం, చిన్న మాలేబొరిగాం, కేబీ కాలనీ, ధర్మగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆదివాసీలకు విద్య, వైద్యంతో పాటు తాగునీటి వసతి కల్పించిందన్నారు. గత ప్రభుత్వం ఆదివాసీ సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో రోకండ్ల రమేశ్, ఎంపీపీ గండ్రత రమేశ్, నాయకులు సేవ్వ జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, గంగయ్య, రమణ పాల్గొన్నారు.

నేడు ఇచ్చోడలో 'రైతునేస్తం'

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతునేస్తం కార్యక్రమం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కైలాస్‌జాదవ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటల సాగులో వివిధ అంశాలపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

1న జొన్న కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: మే 1న ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. మేడే ఉత్సవాలు ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మే 2న యాథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీని వాసరెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవభవన్‌లో పట్టణంలోని హమాలీవాడ, ఖానాపూ ర్, టీచర్స్ కాలనీలకు చెందిన పలువురు యు వకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, ఆశమ్మ, శ్రీలేఖ, కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, శంకర్, రుక్మారెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

ఎదులాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సీపీఐ నాయకులతో సమావేశం అయ్యారు. సీపీఐ రాష్ట్ర నాయకులు కలవేణి శంకర్, జిల్లా నాయకులతో కలిసి చర్చలు జరిపారు. అనంతరం సీపీఐ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ మినిట్స్ బుక్‌ను అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, సీపీఐ జిల్లా నాయకులు ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నళినిరెడ్డి, కుంటాల రాములు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు'



ప్రచారం చేస్తున్న తుల శ్రీనివాస్, నాయకులు

బోథ్: ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సొనాల, టివిటి, పరుపులపల్లె, మందబొగడ, కుచ్చిర్యాల్ తండా, నాగాపూర్ గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుమిత్ర, భీంరావ్, రమేశ్, గోపాల్‌దాస్, సురేందర్, గోపాల్ దాస్, రుక్మన్‌సింగ్, సుభాష్, నరేందర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని అనిల్ అన్న యువ సైన్యం బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి దేవేందర్ రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. నాయకులు ప్రదీప్ సింగ్, శేఖర్, రాజాశేఖర్, సుమన్, సురేందర్, అన్వేష్, అనిల్, శ్యామ్ రెడ్డి, లక్ష్మణ్, ప్రీతం, కృష్ణసాయి పాల్గొన్నారు.

కేరిగామలో బీఆర్‌ఎస్ ప్రచారం

జైనథ్: మండలంలోని కేరిగామ గ్రామంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ కారుగుర్తుకు ఓటువేసి, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్పన్ లింగారెడ్డి, కోల భోజన్న, మద్దుల ఊశన్న, యాసం నర్సింగ్ రావ్, పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా నృత్య దినోత్సవం



విద్యార్థులతో శిక్షకురాలు

కైలాస్‌నగర్: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠం ఆవరణలో జరుగుతున్న అవంతి కూచిపూడి నృత్య శిక్షణ శిబిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నటరాజ స్వామి, వినాయకుడి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నృత్య శిక్షకురాలు గంద్రత్ అవంతిక మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం ప్రపంచంలో ఉన్న అన్ని రకాల నృత్యకారులు తమ కళను గౌరవిస్తూ, ఇతరులలకు నేర్పి సంతృప్తి పడతారన్నారు. కార్యక్రమంలో నాట్య శిక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుగుణను ఆదరించండి

ఆదిలాబాద్‌రూరల్: పేదల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆదరించాలని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు నవీన్ రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని పొచ్చెర గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీష్ రెడ్డి, పోతారెడ్డి, అశోక్ రెడ్డి, కిష్టారెడ్డి, అశోక్, దేవన్న, మహేశ్‌రెడ్డి, గంగాధర్, గొల్ల మోహన్, ఆకుల రాజు పాల్గొన్నారు.

గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న పతంగి బ్రహ్మానందం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి బీజేపీ నాయకులు హరన్ సుభాష్, అంబేకర్ పాండురంగ్, క్లెం దయకర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని కోకస్మన్నూర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడోసారి నరేంద్రమోదీని ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరాల శ్రీనివాస్, కాండ్లి రమణయ్య, మాజీ సర్పంచ్ గంగారాం, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని నాగగూడ, గుర్రాలతండా, గుట్టపక్కతండా గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బొరె రవీందర్, రైల్వేబోర్డు సభ్యులు రమణ, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సుభాష్ సూర్య, రాజేశ్వర్, మహేందర్, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ శ్రేణులు గడప గడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. సోమవారం మండలంలోని కుప్టి, తర్నం, మంగళమోట గ్రామాల్లో పర్యటించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ మరోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవులు, రాజశేఖర్, నాయకులు గాదే శంకర్, గడ్డం భీంరెడ్డి, ఆడేపు నరేందర్, సరసాని మహేందర్ రెడ్డి, రమణ, తుమ్మాజీ భూమేష్ చారి, రాజశేఖర్ రెడ్డి, ఆకుల ప్రభాకర్, శ్రీరామోజీ నవీన్ చారి పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

తలమడుగు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రకాంత్, స్వామి, జక్కుల ప్రభాకర్, మహేందర్ యాదవ్, బొండ్ల వెంకట స్వామి, నాగార్జున్ రెడ్డి, రవీందర్, శశికాంత్, తోట కిష్టు, రవి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

సిరికొండ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్ అన్నారు. సోమవారం మండలంలోని కన్నాపూర్, పోచంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మోదీ ప్రభుత్వం వస్తేనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మాణిక్‌రావు, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు బాలాజీ, కృష్ణ, గణేష్, మారుతి, కోటేష్, జంగు పాల్గొన్నారు.

సేదతీరిన మంత్రి సీతక్క



సేదతీరుతున్న మంత్రి సీతక్క

తాంసి: ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ముమ్మరంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి సీతక్క తాంసి, భీంపూర్, జైనథ్, బేల పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంతో అలసిపోయిన మంత్రి సీతక్క భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ శివారులో పంటచేనులో అరగంట పాటు సేద తీరారు. కార్యకర్తలతో ముచ్చటించి ఫొటోలు దిగారు.